
# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్

13 | హైదరాబాద్, శుక్రవారం 15 మార్చి 2024 | HYDERABAD


## జీవనదానం



జగిత్యాల జిల్లాలోని అంబారిపేటకు చెందిన గోపు రాధ (38) గృహిణి. ఆమెకు భర్త గోపు శ్రీనివాస్, కుమారుడు ఉన్నారు. ఈ నెల 12న రాధ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని కిమ్స్ దవాఖానలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు 13న బ్రేయిన్ డెడ్‌గా నిర్ధారించారు. రాధ కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా, అందుకు అంగీకరించారు. కాలేయం, గుండె, రెండు మూత్రపిండాలు, ఒక ఊపిరితిత్తిని సేకరించారు. – ఖైరతాబాద్, మార్చి 14




వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం నిమ్స్ దవాఖానలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని డైరెక్టర్ డాక్టర్ బీరప్ప జీవన్‌దాన్ తెలంగాణ ఇన్‌చార్జి, నెఫ్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ స్వర్ణలతతో కలిసి ప్రారంభించారు. నిమ్స్ డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, మూత్రపిండాల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీభూషణ్‌రాజు తదితరులు పాల్గొన్నారు. – ఖైరతాబాద్

## ‘ప్లస్’ విలువ ఎంత?

### శంకర్‌పల్లి ఘటనలో అంతుబట్టని మృతుడి రవి ఇంట్లోని రికార్డులు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 14 (నమస్తే తెలంగాణ)/మణికొండ: ముగ్గురు కొడుకులకు ఉరివేసి... తానూ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం టంగగూరు నీరటి రవి విషాద ఘటనలో అగ్గి రాజేసిన మనీ సర్క్యులేషన్ స్కీంలో బాధితులు ఎన్ని కోట్ల రూపాయలు మోసపోయారనేది పోలీసులకు సైతం అంతుచిక్కడం లేదు. పోలీసులు రవి ఇంట్లోని పుస్తకాలను పరిశీలించినప్పుడు పెట్టుబడులు పెట్టిన వారు 150 మందికి పైగానే ఉన్నట్లు తేలింది. అయితే ఆ పేర్ల ముందు మాత్రం 40+, 20+ అంటూ ఉండటంతో అవి వేలా? లక్షలా?? అనేది అంతుబట్టడం లేదు. ఒక్క శంకర్‌పల్లి పరిధిలోనే రూ.25 కోట్ల మేర మోసపోయారనే సమాచారం అందుతున్న నేపథ్యంలో మనీ సర్క్యులేషన్ పేరుతో వందలాది మంది అమాయకులను నిలువునా ముంచిన జీఎస్ఎన్ సంస్థ మూలాలు కేవలం ఇక్కడే ఉన్నాయా? ఇంకా చుట్టుపక్కల గ్రామాల్లోనూ విస్తరించాయా? అనే అంతుచిక్కని ప్రశ్నలు ఉత్కంఠ రేపుతున్నాయి.

**9 మందిపై కేసులు..**

శంకర్‌పల్లి మండలం టంగటూరుకు చెందిన నీరటి రవి ఉదంతంలో ఇప్పటికే పోలీసులు తొమ్మిది మందిపై కేసులు నమోదు చేయగా.. ముగ్గురిని అరెస్టు చేశారు. రవి ఆత్మహత్య తర్వాత ఆయన భార్య ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు తొలుత రవి ఇంట్లో తనిఖీలు చేశారు. ఇంట్లోని పుస్తకాలను పరిశీలించినప్పుడు జీఎస్ఎస్ మనీ సర్క్యులేషన్ సంస్థ ద్వారా టంగటూరు ఇతర గ్రామాల్లో మొత్తంగా 150 మంది కన్నా ఎక్కువ మందే ఊబిలో చిక్కుకున్నట్లుగా గుర్తించినట్లు తెలిసింది. అందులో ఎవరెంత సొమ్ము పెట్టారనే అంశంపై మాత్రం పోలీసులకు స్పష్టత దొరకలేదు. పోలీసులు నమోదు చేసిన కేసులో ఏ1గా ఉన్న తిరుపతిరావుకు చెందిన సంస్థ చిరునామా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లా రాజం గ్రామం, మండలం, గాయత్రీనగర్ కాలనీ, రెండోవీధి సాయిబాబా దేవాలయం పక్కన ఇంటి నంబర్ 16-400 పేరిట ఉంది.

**విచారణ చేపట్టాం: ఇన్‌స్పెక్టర్ వీరబాబు**

మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టంగటూరు గ్రామానికి చెందిన రవి ఆత్మహత్య తర్వాత అతడు స్థానిక ప్రజల నుంచి కొనసాగించిన లావాదేవీపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టామని ఇన్‌స్పెక్టర్ వీరబాబు తెలిపారు. ఇటీవల రవి ఇంట్లో పలు రికార్డులను పరిశీలించగా, అందులో దాదాపు 150 మందికి పైగా పేర్లను రాసి పెట్టారని, వారి ద్వారా పొందిన నగదు వివరాలను రెండంకెలుగా రాశారని తెలిపారు. ఒకరి పేరు పక్కన పది ప్లస్ అంటూ, మరొకరి పేరు పక్కన 40 ప్లస్ అంటూ బుక్కులో నమోదు చేసుకున్నారని ఇన్‌స్పెక్టర్ వీరబాబు వివరించారు. పేర్లున్న వారికి సంబంధించి ఎలాంటి చిరునామా వంటివి ఎక్కడా లేవని, ఎలాంటి రశీదులు కూడా కనిపించలేదని చెప్పారు.

## అధికారులు బాధ్యతతో పనిచేయాలి

### మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, మార్చి14(నమస్తే తెలంగాణ): వచ్చే పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావారణంలో నిర్వహించేందుకు అధికారులు బాధ్యతతో పనిచేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం సంబంధిత ఎన్నికల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షణలో ఉంటాయన్నారు. సమస్యాత్మక ప్రదేశాల్లో ప్రత్యేకమైన ఫ్లయింగ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ. 50 వేలకు మించి నగదు రవాణా చేస్తే సీజ్ చేయాలన్నారు. రూ. 10 లక్షల వరకు ఆధారాలు లేకపోతే ఇన్‌కమ్ టాక్స్ వారికి సమాచారం అందించాలన్నారు.



## ఎన్నికల నిర్వహణకు సిద్ధం కండి

### సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

సిటీబ్యూరో, మార్చి 14 (నమస్తే తెలంగాణ): రానున్న లోక్‌సభ ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం కమిషనరేట్‌లో అన్ని జోన్ల డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, పోలీస్ నోడల్ అధికారులు, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.





ఉస్మానియా పర్సిలీ వద్ద నీటి కోసం మహిళల తిప్పలు

## ట్యాంకర్ కావాలంటే
# రెండ్రోజులు ఆగాల్సిందే..

**వెస్ట్ కారిడార్‌లో జలమండలి ట్యాంకర్‌కు విపరీతమైన డిమాండ్**

**ఫిల్లింగ్ స్టేషన్లకు అదనపు జలాలు తరలించినా.. తీరని కొరత**

**ట్యాంకర్ వెయింటింగ్‌పై ప్రజాప్రతినిధుల జోక్యం**

**సకాలంలో ట్యాంకర్ పంపాలంటూ ఒత్తిడి**

సిటీబ్యూరో: మీకు వాటర్ బోర్డు ట్యాంకర్ కావాలా? ఐతే ఇప్పటికిప్పుడు బుక్ చేసుకుంటే రెండు రోజుల నిరీక్షణ తప్పదు ..ఎందుకంటారా వాటర్ ట్యాంకర్ కోసం రోజుకు దాదాపు వందలాది మంది వెయింటింగ్ లిస్ట్‌లో ఉంటున్నారు.ప్రధానంగా మాదాపూర్, అయ్యప్పసొసైటీ, తట్టిఖానా, మణికొండ, కొండాపూర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, మియాపూర్ పరిధిలోని ఫిల్లింగ్ స్టేషన్లలో ఈ వెయింటింగ్ లిస్ట్ ఎక్కువగా ఉంటోంది. భూగర్భజలాలు పడిపోవడంతో నగరంలో నీటి కొరత తీవ్రమవుతున్నది.

**650 ట్యాంకర్లు..**

గ్రేటర్ వ్యాప్తంగా ప్రస్తుతం 650 ట్యాంకర్లు తిరుగుతున్నాయి. వెస్ట్ కారిడార్‌లో మాత్రం ట్యాంకర్ నీరు కావాలంటే దాదాపు 24 గంటల పైగా సమయం అవుతున్నది. సాధారణంగా మామూలు రోజుల్లో రోజూ 3500 ట్యాంకర్లు సరఫరా అవుతుండగా, గడిచిన కొద్ది రోజులుగా ఈ బుకింగ్ సంఖ్య 4800 నుంచి 5600ల వరకు పెరిగింది. కొన్ని చోట్ల 24 గంటల నీటి సరఫరా, మరికొన్ని చోట్ల సమయ భావాన్ని తగ్గించి ఫిల్లింగ్ స్టేషన్లకు అదనపు నీటిని సరఫరా చేస్తూ ట్యాంకర్ నీటి డిమాండ్‌ను అధిగమించే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవంగా జలమండలి వివిధ జలాశయాల నుంచి రోజూ ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల నుంచి 607 మిలియన్ గ్యాలన్లు (ఎంజీడీలు) రోజు తరలించేందుకు అవకాశం ఉన్నప్పటికీ అధికారులు మాత్రం 565 మిలియన్ గ్యాలన్లు సరఫరా చేస్తున్నారు. రిజర్వాయర్ల నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయని, అవసరమైతే అత్యవసర పంపింగ్ ద్వారా నీటిని తరలించి ప్రజలకు మెరుగైన నీటి సరఫరా చేస్తున్నామని చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో నిర్వహణ లోపాలతో కొన్ని చోట్ల నీటి ఎద్దడి తప్పేలా లేవు. సాధారణ రోజుల్లో గంటన్నర, రెండు గంటల పాటు రోజువిడిచి రోజు సరఫరా చేసే చోట..ప్రస్తుతం వేసవి దృష్ట్యా డిమాండ్ పెరగడంతో అనేక ప్రాంతాల్లో పట్టుమని 40 -60 నిమిషాలు కూడా నీరు సరఫరా కావడం లేదు. దీంతో ప్రజలు జలమండలి కానీ ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. మిషన్ భగీరథకు సరఫరా చేసే నీటిని గ్రేటర్‌కే తరలించాలని, తద్వారా దాదాపు 40 ఎంజీడీల నీరు నగర ప్రజలకు అందిస్తే నీటి సమస్యలు ఉత్పన్నం కావని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పినప్పటికీ అధికారులు అమలు చేయలేకపోయారు. కేవలం అదనంగా 7 ఎంజీడీలు మాత్రమే మళ్లించినట్లు తెలుస్తున్నది.

## 439 అక్రమ నిర్మాణాలు నేలమట్టం

సిటీబ్యూరో, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ పరిధిలో అనధికారిక నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామని, గడిచిన మూడు నెలలుగా 439 అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు కమిషనర్ రోనాల్డ్ రాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనధికార నిర్మాణాలు, లే అవుట్‌లను గుర్తించి పర్యవేక్షణ, చర్యలు తీసుకునేందుకు జోనల్ కమిషనర్ నేతృత్వంలోని జోనల్ ఆఫీస్ స్థాయిలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. టౌన్‌ప్లానర్, న్యాక్ ఇంజినీర్ ద్వారా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పనిచేస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో అనుమతి పొందిన ప్రతి అనుమతిపై నిఘా ఉంటుందని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే సంబంధిత నిర్మాణాదారుడికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

## ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, మార్చి 14 (నమస్తే తెలంగాణ): నేడు ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగనున్న ఇఫ్తార్ విందు సందర్భంగా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు.అలాగే నేడు, రేపు నగరంలో ప్రధాన మంత్రి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.

## నిజాంపేట్‌లో నిషేధిత సిగరెట్లు

దుండిగల్: నిషేధిత సిగరెట్లను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు.వారి వద్ద నుంచి రూ.16వేల విలువ చేసే 114 సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమంగా నిషేధిత సిగరెట్లు విక్రయిస్తునట్లు బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు పాన్ షాప్‌ల వద్ద నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నిజాంపేట్‌లోని కింగ్స్ పాన్ షాప్‌పై దాడి చేయగా, 114 ప్యాకెట్ల నిషేధిత సిగరెట్లు, 2 హుక్కా పైపులు లభించాయి. పాన్‌షాపు నిర్వాహకుడు చుంచు, చంద్రశేఖర్ ,మియాపూర్, నడిగడ్డ తండాకు చెందిన కేతావత్ బాల్‌రాజ్‌లను అదుపులోకి తీసుకుని బాచుపల్లి పోలీసులకు అప్పగించారు.

# 60 లక్షల పార్సిళ్లు..120 కోట్ల ఆదాయం

**దిల్‌సుఖ్‌నగర్‌లో లాజిస్టిక్స్ కౌంటర్‌ను ప్రారంభించిన ఆర్టీసీ ఎండీ**

ఎల్బీనగర్, మార్చి 14: టీఎస్ఆర్టీసీ ప్రవేశపెట్టిన లాజిస్టిక్స్ విభాగం ద్వారా కస్టమర్లకు వేగవంతంగా, భద్రతతో పార్సిళ్లను గంటల్లో గమ్యస్థానాలకు చేరవేస్తున్నామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. నెట్‌వర్క్, టెక్నాలజీని ఉపయోగించుకొని ఎలాంటి జాప్యం లేకుండా పార్సిళ్లను అందిజేసే విధంగా అన్ని చర్యలు తీసకుంటున్నట్లు పేర్కొన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్-2 డిపో ఆవరణలో మోడల్ లాజిస్టిక్స్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అదే విధంగా టీఎస్ఆర్టీసీ లాజిసిక్స్ నూతన లోగో, బ్రోచర్‌ను సైతం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ ప్రతి రోజు సగటున 15వేల పార్సిళ్లను లాజిస్టిక్స్ విభాగం గమ్యస్థానాలకు చేరవేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపు 60 లక్షల పార్సిళ్లను రవాణా చేశామని, సంస్థకు సుమారు రూ. 120 కోట్ల వరకు ఆదాయం వచ్చిందని వెల్లడించారు. కార్గో ద్వారా మరో రూ. 27 కోట్ల వరకు రాబడి సమకూరిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంస్థ ఆధ్వర్యంలో 60 కౌంటర్లు, 401 ఏజెంట్ కౌంటర్లతో నెట్‌వర్క్ విస్తరించి ఉన్నట్లు చెప్పారు. ప్రజల నుంచి లాజిస్టిక్స్ విభాగానికి మంచి ఆదరణ లభిస్తున్నదని చెప్పారు. కస్టమర్ల సౌకర్యార్థం హోం డెలివరీ, పికప్ సౌకర్యాలను కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి స్కీం ద్వారా దాదాపు 25కోట్ల మంది మహిళలు, ట్రాన్స్‌జెండర్ ప్రయాణికులు బస్సు సౌకర్యం వినియోగించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రవీందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్. కృష్ణకాంత్, ఈడీ హైదరాబాద్ జోన్ పురుషోత్తం నాయక్ తదితరులు పాల్గొన్నారు.




లాజిస్టిక్స్ లోగోను ఆవిష్కరించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

## బొప్పాయి విత్తులతో కల్తీ మిరియాలు

**బేగంబజార్‌లో హోల్‌సెల్ దందా**

**కిరాణా దుకాణం నిర్వాహకుడు అరెస్ట్**

**700 కిలోల కల్తీ సరుకు స్వాధీనం**

సిటీబ్యూరో, మార్చి 14 (నమస్తే తెలంగాణ): బొప్పాయి విత్తులు, ఇతర రసాయనాలతో నకిలీ మిరియాలు తయారు చేసి విక్రయిస్తున్న బేగంబజార్‌కు చెందిన వ్యాపారిని సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. అదనపు డీసీపీ శ్రీనివాస్ రావు కథనం ప్రకారం.. బేగంబజార్‌కు చెందిన వినోద్ కుమార్ గెహ్లాట్ అలియాస్ వినోద్ గెహ్లాట్ స్థానిక ఫిష్ మార్కెట్ సమీపంలో వినోద్ ట్రేడింగ్ కంపెనీ పేరుతో కిరణా దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఇందులో కల్తీ ఆహారపు వస్తువులు విక్రయిస్తున్నారనే సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి బృందం.. దుకాణంపై దాడి చేసింది. 700 కిలోల కల్తీ మిరియాలు లభించాయి. వీటిని నగరంతో పాటు కర్ణాటక రాష్ట్రానికి కూడా సరఫరా చేస్తూ భారీ లాభాలు ఆర్జిస్తున్నట్లు తేలింది. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి తదుపరి విచారణకు షాహినాయత్‌గంజ్ పోలీసులకు అప్పగించారు.

# ఫ్యామిలీ అంతా..గంజాయి బిజినెస్

### 18 కేసులు.. జైలు జీవితం
### నీతుబాయ్ నేరప్రస్థానమిది

- ఆమె ఇంటిలో పోలీసుల తనిఖీ
- 22.6 కిలోల గంజాయి, రూ.22.10 లక్షల నగదు స్వాధీనం
- అదుపులో 13 మంది యువకులు

సిటీబ్యూరో, మార్చి 14 (నమస్తే తెలంగాణ): మత్తు దందాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. పలు చోట్ల గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేశారు. ఇందులో గంజాయి డాన్ నీతూ బాయ్ కూడా ఉన్నది. వివరాలివి..ఐటీ కారిడార్‌లో గత కొన్ని సంవత్సరాలుగా గంజాయి వ్యాపారం కొనసాగిస్తున్న గంజాయి డాన్ నీతుబాయ్‌తో పాటు ఆమె బంధువులు మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద గంజాయి కొనుగోలు చేసి సేవిస్తున్న 13 మంది యువకులను సైతం అదుపులోకి తీసుకున్నారు. నీతుబాయ్ అండ్ గ్యాంగ్ వద్ద



నుంచి విక్రయించేందుకు ఉంచిన 22.6 కిలోల గంజాయిని, రూ.22.10 లక్షల నగదుతోపాటు మరో రూ.12.30 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నానక్‌రాంగూడ లోథాబస్తీకి చెందిన కాలావతి నీతూబాయ్(46) తన కుటుంబ సభ్యులతో కలిసి గంజాయి విక్రయిస్తున్నది. ఆమెపై 18 కేసులు నమోదు కాగా, అనేకసార్లు జైలుకు సైతం వెళ్లి వచ్చింది. ఆమె భర్త కాలావతి మున్ను సింగ్ (53) ఇతర కుటుంబ సభ్యులు సైతం గంజాయి, గుడుంబా, మద్యం విక్రయిస్తూ గతంలో పోలీసులకు పట్టుబడ్డారు. ఈ దందాల ద్వారా నీతుబాయ్, ఆమె కుటుంబ సభ్యులు కోట్లాది రూపాయల ఆస్తులను కూడబెట్టారు. నీతుబాయ్‌పై సైబరాబాద్ పోలీసులు 2021లో పీడీ యాక్ట్ నమోదు చేసి అరెస్టు చేశారు. 2022 అక్టోబర్‌లో జైలు నుంచి విడుదలైన నీతుబాయ్ తిరిగి గంజాయి వ్యాపారం చేయడం ప్రారంభించింది. 2023 ఆగస్టులో నీతుబాయి తన బంధువులు కాలావతి గౌతం సింగ్, నేహబాయ్‌లతో కలిసి గంజాయి విక్రయిస్తుండగా గోల్కొండ పోలీసులు అరెస్టు చేసి ఆమె 16 బ్యాంక్ అకౌంట్లలో ఉన్న రూ.1.53 కోట్ల నగదును ఫ్రీజ్ చేయడంతోపాటు రూ.4 కోట్ల ఆస్తులను సైతం సీజ్ చేశారు. అనంతరం జైలు నుంచి విడుదలైన తరువాత నీతుబాయ్ గంజాయి వ్యాపారాన్ని తిరిగి ప్రారంభించింది. ధూల్‌పేటకు చెందిన అంగూరీ బాయ్ వద్ద నుంచి కిలో రూ.8వేల చొప్పున కొనుగోలు చేసి 5 గ్రాముల ప్యాకెట్లను తయారు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.500 చొప్పున ఐటీ కారిడార్‌లో విక్రయిస్తోంది. గచ్చిబౌలి పోలీసులు, టీఎస్ నాబ్ అధికారులు బుధవారం నీతుబాయ్ నివాసంలో తనిఖీలు చేసి.. నీతుబాయ్, ఆమె భర్త మున్ను సింగ్, సురేఖ, మమతలను అరెస్టు చేశారు.

**మహారాష్ట్ర టూ ధూల్‌పేట్‌కు..**

సిటీబ్యూరో: మహారాష్ట్ర నుంచి గంజాయి తెచ్చి ధూల్‌పేట్ అడ్డాగా విక్రయించాలని ప్లాన్ చేసిన మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులను సౌత్ వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీసీపీ రష్మీపెర్మాల్ కథనం ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ జిల్లాకు చెందిన జీవన్ రామ్‌రావు రాథోడ్, రవి సోదరులు గడ్చిరొరి గ్రామంలో 34 కిలోల గంజాయి కిలో ఆరు వేల చొప్పున కొనుగోలు చేశారు. అక్కడి నుంచి వాహనంలో జీవన్‌రామ్, డ్రైవర్ ఆనంద్ భీమ్‌సింగ్ జాదవ్‌తో కలిసి హైదరాబాద్‌కు వచ్చారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవే పిల్లర్ నం. 4 సమీపంలో పట్టుకున్నారు. జీవన్, ఆనంద్‌భీమ్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 13.80 లక్షల విలువైన సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.

**అలవాటుపడి..**

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని శ్రీరాంనగర్‌కు చెందిన మహిళ (37) కొంతకాలంగా గంజాయికి అలవాటు పడింది. అంతేకాకుండా గంజాయిని సైతం విక్రయిస్తున్నది. బంజారాహిల్స్ పోలీసులు బుధవారం రాత్రి ఆమె ఇంటికి వెళ్లి తనిఖీ చేయగా, 100 గ్రాముల గంజాయి దొరికింది. నిందితురాలిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

**గంజాయి చాకెట్లు స్వాధీనం**

సిటీబ్యూరో: బిహార్ రాష్ట్రానికి చెందిన శిబుకుమార్(19) జీడిమెట్లలోని రామిరెడ్డినగర్‌లో కిరాణాషాపు ముసుగులో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నాడు. ఎస్‌వోటీ పోలీసులు కిరాణాషాపుపై దాడి చేసి 150 చాక్లెట్లను స్వాధీనం చేసుకుని, శిబుకుమార్‌ను అరెస్టు చేశారు. సీతారామ్ సింగ్(60) పటాన్‌చెరు వెంకటేశ్వర కాలనీలో కిరాణాషాపు నిర్వహిస్తూ మత్తు చాక్లెట్లు విక్రయిస్తున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి, 1960 చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. కూకట్‌పల్లికి చెందిన సి.చంద్రశేఖర్(34), మియాపూర్‌కు చెందిన కె.బాల్‌రాజ్(23)లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.16వేల విలువ చేసే 114మత్తు చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆల్విన్ ఎక్స్‌రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు విద్యార్థులను అరెస్టు చేశారు.